క్లుప్తంగా

ఘనంగా కోత పండుగ

సాక్షి, భీమవరం : క్రైస్తవ దేవాలయాల వద్ద ఆదివారం క్రైస్తవులు కోత పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక బేతని చర్చి వద్ద వివిధ రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. పాస్టర్ ఎస్.పుష్పరాజ్ మాట్లాడుతూ కోత పండుగ అంటే కృతజ్ఞాత ర్పణల పండుగ అని, ఈ సందర్భంగా క్రైస్తవులు తమ పంటల ప్రథమ ఫలాలను దేవునికి అర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పట్టా దేవరాజ్, పీజే కెనడీ, పి.రతన్, పీజే విజయవరం, పి.సుదర్శన్‌కుమార్, పాకెర్ల జోసఫ్ లూథర్, గంటా సుందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ జిల్లా సమావేశం

పాలకోడేరు : పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌టీయూ 76వ కౌన్సిల్ సమావేశం ఆదివారం శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు త్వరలోనే ఎస్టీయూ ద్వారా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గుత్తుల శ్రీనివాస్, జవహర్‌రాజు, రామచంద్రరావు, జనార్దన్ రావు, బి పాండురంగారావు, ఎం.మహంకాళి పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్ట్‌కు గాయాలు

భీమవరం అర్బన్ : ఎదురెదురుగా రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఒక మోటార్‌సైక్లిస్టు గాయపడ్డాడు. వివరాల ప్రకారం కృష్ణాజిల్లా, కృత్తివెన్ను మండలం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన అడబాల వెంకన్న టైలరింగ్ చేస్తుంటాడు. ఆదివారం కుట్టు మెషీన్ రిపేరింగ్ నిమిత్తం భీమవరం వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా మండలంలోని డేగాపురం వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో మోటార్‌సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకన్నను కాలు విరిగింది. క్షతగాత్రుడ్ని స్థానికులు భీమవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడు వెంకన్న ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై డి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నరసింహ స్వామి కల్యాణం

మొగల్తూరు: మండలంలోని కాళీపట్నం పడమర గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఏటా మాఘమాసంలో స్వామి వారి కల్యాణాన్ని జరిపించడం ఆనవాయితీ. జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, మీనాక్షి దంపతులు స్వామి వారి కల్యాణం క్రతువును నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

విద్యతోనే ఉన్నత లక్ష్యాలు

నరసాపురం రూరల్: విద్యతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యమని నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. నరసాపురం- పాలకొల్లు రహదారిలో ఉన్న సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, నిబద్ధతతో కృషి చేస్తే సాధించడం కష్టమేమీ కాదన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వాసా శ్రీనివాసరావు, డైరెక్టర్ వాసా మాధవి, సీఈఓ సనో, అకాడమిక్ హెడ్ ఆర్.వేణి, ప్రిన్సిపాల్ వలవల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విద్య బోధించాలి

తాడేపల్లిగూడెం: మంచి సమాజం కోసం పిల్లలకు బాల్యం నుంచే నైతిక విద్యను బోధించాలని జమాతే ఇస్లామిహింద్ గూడెం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. మహిళా విభాగం ఇన్‌చార్జి చాంద్ సుల్తాన్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర వ్యాప్త ఉద్యమంలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ముత్యాల శిరీష, ఆస్మా, ఆఫ్రినా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తాడేపల్లిగూడెం: పేద కుటుంబాలకు విద్య, వైద్యావసరాల నిమిత్తం కోలా రోహిణి గంగాధర్ ఫౌండేషన్ తరపున సాయమందిస్తున్నట్టు సంస్థ బాధ్యులు రాజన్ ఆర్ముగనాథన్, రాజన్ సుభాషిణి తెలిపారు. ఆదివారం పట్టణంలో బొగి శ్రీనివాసరావు, గుండుగొలను ధనలక్ష్మి, చెరుకూరి వరలక్ష్మయ్యకు రూ.66,515 సాయం అందించారు.

వెంపటాపునకు ప్రశంసలు

తణుకు అర్బన్: విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల చిత్రకళా ప్రదర్శనలో తణుకుకు చెందిన చిత్రకారుడు వెంపటాపు ప్రదర్శనకు ప్రశంసలు దక్కాయి. 45 మంది చిత్రకారులు పాల్గొన్న ఈ చిత్రకళా ప్రదర్శనలో తాను ప్రదర్శించిన చిత్రానికి పలువురు ప్రశంసించి సత్కారం, మెమెంటో అందజేసినట్లు వెంపటాపు వివరించారు.

అన్ని రంగాల పురోగతికి బడ్జెట్ దోహదం

తాడేపల్లిగూడెం: సమ్మిళిత అభివృద్ధి ధ్యేయంగా రూపకల్పన చేసిన కేంద్ర వార్షిక బడ్జెట్ దేశ భవిష్యత్తు చిత్రంలో సమూల మార్పులకు బీజం వేసిందని ఆర్థిక నిపుణులు లంక దినకర్ అన్నారు. పట్టణంలోని గమిని ఫంక్షన్ హాలులో ఆదివారం చాంబర్ ఆఫ్ కామర్స్ సౌజన్యంతో 2023-24 కేంద్ర వార్షిక బడ్జెట్‌పై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. అమృతకాల బడ్జెట్ ద్వారా 2045 నాటికి అన్ని రంగాల పురోగతికి ప్రధాని మోదీ బాటలు వేశారని దినకర్ అన్నారు. రాజకీయాలకు, వివక్షకు తావులేకుండా బడ్జెట్ అమలు చేయడం హర్షణీయమన్నారు. ఉన్నమట్ల కబర్థీ, చిట్యాల రాంబాబు, ఈతకోట తాతాజీ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ఉండి : స్థానిక పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న శివరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం డీఎస్పీ శ్రీనాథ్, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన అతిథులకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని డీఎస్పీ, ఎంపీపీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఎంపీపీ మాట్లాడుతూ శివాలయంలో గాలిగోపురం, కళ్యాణమండపం నిర్మాణం చేపడుతున్నామని, భక్తులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సన్నిధిరాజు చలపతి, సహాయకులు టి.కిరణ్, వై.ఫణీ, వి.గీత, ట్రస్ట్ బోర్డు సభ్యులు శేషాద్రి శ్రీనివాస్, మండా రత్నమాణిక్యం, మంతెన వెంకట్రాజు, ముద్రపల్లి వెంకట విజయలక్ష్మి, ఆకుల సుబ్బలక్ష్మి, ఆలయ మేనేజర్ రుద్రరాజు ఫణికిశోర్, అర్చకులు సన్నిధిరాజు, కృష్ణ, శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.



శివాలయంలో కరపత్రాలను విడుదల చేస్తున్న డీఎస్పీ శ్రీనాథ్, ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

వైభవంగా అమ్మవార్ల ఊరేగింపు

భీమవరం అర్బన్ : మండలంలోని తుందుర్రు గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవతలు ముత్యాలమ్మ, మారెమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల 61వ జాతర మహోత్సవములో భాగంగా ఆదివారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాణసంచాతోను, మేళతాళాలు, శక్తి వేషధారణల నడుమ అమ్మవార్ల గరగలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



జాతర మహోత్సవంలో శక్తి వేషధారణ



గరగలను ఊరేగిస్తున్న దృశ్యం

ఆశ కార్యకర్తలకు పనిభారం తగ్గించాలి

కాళ్ల : ఆశ కార్యకర్తలకు పనిభారం తగ్గించాలని ఆశ వర్కర్ల జిల్లా కార్యదర్శి దిగుబాటి జ్యోతి కోరారు. ఆశ వర్కర్ల కాళ్ల మండల విస్తృతస్థాయి సమావేశం స్థానిక మహంకాళమ్మ గుడి ఆవరణలో రెడ్డి దేవి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జ్యోతి మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అధికారుల వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం భీమవరంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సమావేశంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హ్యాకథాన్ పోటీల్లో విజేతలకు బహుమతులు

సాక్షి, భీమవరం : స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించిన 24 గంటల హ్యాకథాన్ పోటీల్లో ఈ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ డేటా సైన్స్‌లో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గొంటు నరసింహారెడ్డి, అడ్డాల వెంకట లక్ష్మి శ్రావణి మాట్లాడుతూ ఈ కామర్స్‌లో తక్కువ ఖర్చుతో వినియోగదారుడికి వస్తువు చేరే విధంగా వెబ్‌సైట్ రూపొందించామని, తమ ప్రాజెక్టుకు ప్రథమ స్థానం లభించిందని చెప్పారు. ఈ పోటీల్లో విశాఖపట్నం అనిట్స్ విద్యాసంస్థ ద్వితీయ స్థానం సాధించగా, పూణేకి చెందిన విశ్వకర్మ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విద్యార్థులు కన్సోలేషన్ బహుమతి అందుకున్నారు. ఈ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన 42 మంది విద్యార్థులకు బ్రెయిన్ ఓ విజన్ సంస్థ నెల రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తామని ప్రకటించింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాద్ రాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత్ వర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ఈ పోటీల్లో సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొనారని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు, కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.హేమలత, బ్రెయిన్ ఓ విజన్ వ్యవస్థాపకులు సీఈవో డి.గణేష్ నాగ్, కన్వీనర్ డాక్టర్ కే కిషోర్‌రాజు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు

వ్యసనాల నిర్మూలనను సామాజిక బాధ్యతగా తీసుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్) : స్థానిక శాంతి హాస్పటల్‌లో మత్తు పదార్థాల వినియోగం వల్ల వచ్చే ప్రాణాంతక వ్యాధులపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానసిక వైద్యులు జీవీ రమణరావు మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం, డ్రగ్స్ వంటి వ్యసనాలు ముందు సరదాగా మొదలవుతాయని, క్రమేపీ అలవాటుగా మారి ప్రాణాంతకంగా మారతాయని అన్నారు. ముఖ్యంగా యువత వీటి బారిన పడి జీవితాలు ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యసనాల నిర్మూలనను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్లకార్డుల ప్రదర్శనతో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనేక మంది రోగులు డాక్టర్ జీవీ రమణ రావుని ప్రశ్నలు అడిగి నివృత్తి చేసుకున్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, భీమవరం లయన్స్ క్లబ్ కార్యదర్శి నరహరి శెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విష్ణు విద్యా సంస్థల విరాళం

సాక్షి, భీమవరం : స్థానిక ముస్లింల శ్మశానవాటికలో పూడిక పనుల నిమిత్తం విష్ణు విద్యా సంస్థల చైర్మన్ కేవీ విష్ణు రాజు ఆదివారం రూ.3 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ముస్లిం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జనాబ్ షేక్ రబ్బానీ, జనాబ్ ఎండీ జలాలుద్దీన్ బాబా కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో దివంగత డాక్టర్ బీవీ రాజు హయాం నుంచి విష్ణు విద్యా సంస్థల యాజమాన్యం ముందుంటారని అన్నారు. గతంలో ఉర్దూ పాఠశాల నిమిత్తం కూడా రూ.లక్ష విరాళం ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ కన్వీనర్ ముహమ్మద్ సిద్దీఖ్, ముస్లిం కమిటీ గౌరవ అధ్యక్షుడు ఎండీ అల్లావుద్దీన్ నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందచేస్తున్న చైర్మన్ కేవీ విష్ణురాజు

కిడ్నీ వ్యాధి బాధిత కుటుంబానికి సాయం

యలమంచిలి: మండలంలోని ఏనుగువానిలంక గ్రామానికి చెందిన బందెల గంగయ్య (42)కు రెండు కిడ్నీలు చెడిపోయాయి. దీంతో అతనికి డయాలసిస్ చేయిస్తుండడంతో మంచానికే పరిమితమయ్యాడు. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో మందులు కొనుగోలు, కుటుంబ పోషణకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు వసుధ ఫౌండేషన్ పాలకొల్లు శాఖ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజుకు వివరించారు. అతను ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజుకు విషయం చెప్పడంతో రామరాజు స్పందించి రూ.10 వేలు నగదు పంపించారు. ఆ నగదును ఆదివారం బుద్ధరాజు ఏనుగువానిలంక తీసుకువచ్చి గంగయ్య భార్య రాజమణికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈద ప్రమీల, ఉప సర్పంచ్ జంపన సూర్య వెంకటరాజు, గ్రామ పెద్దలు వినుకొండ వెంకటేశ్వరరావు, హరికుమార్ పాల్గొన్నారు.



ఏనుగువానిలంకలో కిడ్నీ వ్యాధి బాధితుని భార్యకు ఆర్థిక సహాయం అందజేస్తున్న పెన్మెత్స బుద్ధరాజు

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం : స్థానిక శ్రీసీతారామస్వామి వారి దేవస్థానంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నరసాపురానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ యం.కృష్ణవేణి జ్ఞాన బోధ చేశారు. ధ్యాన సాధన ద్వారా నాడీ మండల శుద్ధి జరిగి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పొందుతామన్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ తూ.గో.జిల్లా పేరవరంలో నిర్మిస్తున్న శ్రీవశిష్ట గౌతమి పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో స్వర్ణమాలా పత్రీజీ ఆధ్వర్యంలో మార్చి 16 నుంచి 22 వరకు జరగనున్న ఉగాది ధ్యాన జ్ఞాన యజ్ఞానికి అందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సన్నిధి ఉదయ్, మేడిశెట్టి కృష్ణారావు, తీడ నాగరాజు, వల్రె విశ్వేశ్వరరావు, పాలా మంగతాయారు, బి.శ్రీదేవి, బోలం యర్రమ్మ, బాజింకి సావిత్రి, వాణి పాల్గొన్నారు.



ధ్యాన శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

సరళాదేవికి నాదస్వర విద్వాంసుల స్మారక అవార్డు

తణుకు టౌన్: తణుకు పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు, సంఘ సేవకురాలు వావిలాల సరళాదేవి, వెంకటరమేష్‌కు తాడేపల్లిగూడెంలో నిర్వహించిన మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమంలో ప్రముఖ నాదస్వర విద్వాంసులు నాగుర్ సాహెబ్, మదీనా బీబీ స్మారక అవార్డును అందజేశారు. శనివారం రాత్రి తాడేపల్లిగూడెంలోని బీవీఆర్ కళా క్షేత్రంలో నిర్వహించిన ఘంటసాల వర్ధంతి కార్యక్రమానికి సంస్థ వ్యవస్థాపకుడు ఎస్ కాశిం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సాంస్కృతిక, నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు సరళాదేవి, వెంకటరమేష్ దంపతులను సత్కరించి అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ తాడేపల్లి మోహనరావు, సబ్ రిజిస్ట్రార్ లంక వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సరళాదేవి కళాకారులకు అందిస్తున్న సేవలను కొనియాడారు.



బీవీఆర్ కళాక్షేత్రంలో వావిలాల సరళాదేవి, వెంకటరమేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నేత్రపర్వంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ పూజలు



బల్లిపాడు కాశీవిశాలాక్షి విశ్వేశ్వరస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గోపూజ చేస్తున్న భక్తులు

అత్తిలి: బల్లిపాడులో వేంచేసియున్న కాశీవిశాలాక్షి విశ్వేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో గణపతి ప్రయుక్త ఆదిత్యాది నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గోపూజ చేశారు. మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం, శాంతికల్యాణం నిర్వహించారు. వెలవలపల్లి బాలసుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు బాదంపూడి సోమశేఖరశర్మ, వెలవలపల్లి కాశీ, పలువురు వేదపండితుల సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు కార్యక్రమానికి హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. మహిళలు గోవులకు పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ప్రోత్సాహకులు ఆకుల పండుస్వామి, ఆకుల భుజంగరావు, తలారి శ్రీనివాస్, ట్రస్టు బోర్డు చైర్మన్ ధనుమూరి తాతాజీ, సర్పంచ్ కొరెడ్డి బాలాజీ, సొసైటీ అధ్యక్షుడు గుబ్బల ఆంజనేయులు, వడ్డి నాగేశ్వరరావు, విత్తంశెట్టి సత్తిబాబు, తోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద వీఆర్‌ఏల ధర్నా

సాక్షి, భీమవరం : వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఫేస్ అటెండెన్స్ నుంచి మినహాయించాలని కోరుతూ మంగళవారం భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వీఆర్‌ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు తెలిపారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఫేస్ అటెండెన్స్ రద్దుచేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వీఆర్‌ఏలు అందరూ పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రేపు హిందూధార్మిక సంస్థల నిరసన

పాలకొల్లు సెంట్రల్: హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తామని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాలరాజు అన్నారు. ఆదివారం స్థానిక రైల్వేగేటు సమీపంలో సరస్వతి శిశుమందిర్‌లో విశ్వహిందూపరిషత్, భజరంగదళ్, బీజేపీ, ధర్మపరిరక్షణ, క్షీరారామలింగేశ్వర సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరాజు మాట్లాడుతూ హిందువులపై ఒక పథకం ప్రకారం దాడులు జరుగుతున్నాయన్నారు. గతంలో 30 యాక్ట్ అమల్లో ఉన్నప్పుడు రెచ్చగొట్టే విధంగా ప్రదర్శనలు చేసినప్పుడే పోలీసులు చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి ఇంతవరకూ వచ్చేదికాదన్నారు. ఈ నెల 14న శాంతియుతంగా నిరసన తెలియజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పి జిల్లా ఉపాధ్యక్షులు మాధవశర్మ, జిల్లా కార్యదర్శి సునీత, భజరంగదళ్ జిల్లా ప్రచారక్ కస్తూరి అఖిల్, క్షీరా రామలింగేశ్వర స్వామి సేవా సమితి అధ్యక్షులు శీరం ఆనందకృష్ణ, బీజేపీ నాయకులు జక్కంపూడి కుమార్, క్షీరా రామలింగేశ్వర స్వామి, అష్ట భుజ లక్ష్మీనారాయణ స్వామి, కనకదుర్గమ్మ ఆలయాల చైర్మన్లు కోరాడ శ్రీనివాసరావు, గాదె వెంకన్న, కావలి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీని సోమవారం లెక్కించనున్నట్లు ఈఓ డి.రామకృష్ణంరాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు తమ పేర్లను కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని కోరారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు.. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని సబ్‌కలెక్టర్ ఆదివారం విలేకరులకు చెప్పారు. ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందించాలని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు : 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నిమిత్తం సోమవారం కుముదవల్లి గ్రామంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నేతలు

సాక్షి, భీమవరం : సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్ రొయ్యల పరిశ్రమలో తొలగించిన 10 మంది ట్రాలీ డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ది భీమవరం ఏరియా ఆక్వా అనుబంధ వెహికల్ డ్రైవర్ యూనియన్ కార్యదర్శి అల్లూరి అరుణ్ డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఎస్‌కే భాష అధ్యక్షతన డ్రైవర్ల యూనియన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ యాజమాన్యం బేటాలను అర్ధాంతరంగా నిలుపుదల చేసిందని, అడిగిన డ్రైవర్లను నిర్దాక్షిణ్యంగా తొలగించడం దారుణమన్నారు. యాజమాన్యం మొండి వైఖరిపై సోమవారం పరిశ్రమ వద్ద దీక్షలకు దిగుతున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గుండా బత్తుల కోటేశ్వరరావు, వి శ్రీనివాస్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఆకివీడు : స్థానిక పెదపేట, మాదివాడ హరిజనపేట ప్రాంతాలకు చెందిన ఇరువర్గాల మధ్య పాత కక్షల నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ రాత్రి కర్రలతో దాడి చేసుకున్న ఘటనపై ఇరువురు వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే.రాజారెడ్డి చెప్పారు. పెదపేటకు చెందిన పాము డెన్నీ వర్గానికి మాదివాడ హరిజనపేటకు చెందిన యాళ్ల ప్రభు వర్మలకు పాత గొడవలున్నాయన్నారు.